ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: **20**.07.2024 సమయం: **07**.05 గంటలు

ముఖ్యాంశాలు

1. మైక్రోసాఫ్ట్ సేవల అంతరాయంతో భారతీయ ఆర్థిక వ్యవస్థ, చెల్లింపుల వ్యవస్థలు పెద్దగా ప్రభావితం కాలేదని రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది.
2. ప్రపంచవ్యాప్తంగా ఐటీ అవుటేజ్ వల్ల ఎయిర్‌లైన్స్ నుండి హెల్త్ కేర్ వరకు బహుళ సేవలు నిన్న గంటల తరబడి స్తంభించి ఇప్పుడు నెమ్మదిగా కోలుకుంటున్నాయి.
3. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిన్న అమరావతిలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ఇతర నిపుణులతో సమావేశం జరిపారు.
4. బంగాళఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కోస్తాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో ఈరోజు, విదర్భ, తెలంగాణలలో ఈరోజు, రేపు అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

## WORLDWIDE-IT OUTAGE

ప్రపంచవ్యాప్తంగా ఐటీ అవుటేజ్ వల్ల ఎయిర్‌లైన్స్ నుండి హెల్త్ కేర్ వరకు బహుళ సేవలు నిన్న గంటల తరబడి స్తంభించి ఇప్పుడు నెమ్మదిగా కోలుకుంటున్నాయి. మైక్రోసాఫ్ట్ సాఫ్ట్ వేర్ అంతరాయం కారణంగా ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు ఇబ్బంది పడ్డారు. అమెరికా సైబర్-సెక్యూరిటీ సంస్థ అయిన క్రౌడ్‌స్ట్రైక్ పొరపాటుగా ఒక సాఫ్ట్ వేర్ అప్‌డేట్‌ను విడుదల చేయడంతో మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై ప్రభావం పడి ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ వ్యవస్థలు పనిచేయలేదు. దీంతో వాణిజ్య వ్యాపారాలు, బ్యాంకింగ్ సేవలు, ఆసుపత్రులు, ఎయిర్‌లైన్ కార్యకలాపాలు చాలా దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్

సీఈఓ సత్య నారాయణ నాదెళ్ల సోషల్ మీడియాలో ఒక సందేశమిస్తూ... సిస్టమ్‌లను సురక్షితంగా ఆన్‌లైన్‌లోకి తీసుకురావడానికి కస్టమర్‌లకు సాంకేతిక మార్గదర్శకత్వం, మద్దతును అందించడానికి తాము క్రౌడ్‌స్ట్రైక్ తో, కంప్యూటర్ పరిశ్రమతో సన్నిహితంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈ అంతరాయానికి క్రౌడ్‌స్ట్రైక్ **CEO** క్షమాపణలు చెప్పారు. పరిష్కారాన్ని జారీ చేసినట్లు చెప్పారు. అన్ని సిస్టమ్‌లు బ్యాకప్ అయి, రన్ కావడానికి కొంత సమయం పడుతుందని ఆయన తెలిపారు. కాగా, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ నిన్న మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్త అంతరాయానికి సంబంధించి మైక్రోసాఫ్ట్, దాని అసోసియేట్‌లతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని, ఇందువల్ల ప్రభావితమైన సంస్థలతో తమ శాఖ చురుకుగా పనిచేస్తోందని మంత్రి చెప్పారు.

**RBI-IT OUTAGE**

మైక్రోసాఫ్ట్ సేవల అంతరాయంతో భారతీయ ఆర్థిక వ్యవస్థ, చెల్లింపుల వ్యవస్థలు పెద్దగా ప్రభావితం కాలేదని రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందువల్ల కేవలం **10** బ్యాంకులు, **NBFC** లకు మాత్రమే చిన్న అంతరాయాలు కలిగాయాని తెలుస్తోందని, అయితే వాటిని కూడా పరిష్కరిస్తున్నట్లు చెప్పింది. చాలా బ్యాంకుల కీలకమైన సిస్టమ్‌లు క్లౌడ్‌లో లేవని, కొన్ని బ్యాంకులు మాత్రమే క్రౌడ్‌స్ట్రైక్ టూల్‌ను ఉపయోగిస్తున్నాయని వెల్లడించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ దిలీప్ అస్బే మాట్లాడుతూ... విస్తృతంగా ప్రాచుర్యం పొందిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌తో సహా దేశంలోని చెల్లింపుల నిర్మాణం దెబ్బతినలేదని అన్నారు.

**PM VIETNAM LEADER CONDOLENCE**

వియత్నాం దేశాధినేత, జనరల్ సెక్రటరీ న్గుయెన్ ఫు ట్రోంగ్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఒక సందేశంలో నరేందరమోదీ మరణించిన నాయకుడికి నివాళులర్పించారు. ఈ దుఃఖ సమయంలో వియత్నాం ప్రజలకు, నాయకత్వానికి భారతదేశం సంఘీభావంగా నిలుస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

## SHAH - SECURITY AGENCIES

దేశంలో భద్రతా సవాళ్లను పరిష్కరించడానికి బాధ్యత వహించే మల్టీ ఏజెన్సీ సెంటర్ ఆఫ్ ఇంటెలిజెన్స్ బ్యూరో పనితీరును సమీక్షించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న కొత్తఢిల్లీలో వివిధ భద్రతా ఏజెన్సీలు, లా ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెన్సీ అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఉన్న వివిధ భద్రతా సంస్థల అధిపతులు, ఇతర ఇంటెలిజెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెన్సీలు జాతీయ భద్రత విషయంలో ప్రభుత్వ వైఖరిని అమలు చేయాలని అన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్ లను, వాటి సహాయక వ్యవస్థను రూపుమాపడానికి అన్ని ఏజెన్సీల మధ్య అత్యధిక సమన్వయం ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

## MEA RUSSIA UKRAINE

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ నిన్న మధ్యాహ్నం ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో సంభాషించారు. పరస్పర ప్రయోజనాలపై చర్చించారు. నిన్న మధ్యాహ్నం కొత్త ఢిల్లీలో మీడియాతో విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, ఉక్రెయిన్‌తో భారతదేశం ద్వైపాక్షిక, సంస్థాగత యంత్రాంగాలతో సహా అనేక ఒప్పందాలను కలిగి ఉందని అన్నారు. ఆయన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ... ఇటీవల భారత్, రష్యాల మధ్య జరిగిన వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ప్రధనమంత్రి నరేంద్ర మోదీ రష్యా వెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా హింస వల్ల అమాయక ప్రజలు నష్టపోతున్నారని నరేంద్రమోదీ ఆ సమావేశంలో చెప్పారని జైశ్వాల్ వెల్లడించారు.

## SC-WB GOVERNOR

క్రిమినల్ ప్రాసిక్యూషన్ నుండి గవర్నర్‌లకు మినహాయింపును కల్పించే రాజ్యాంగంలోని **361**వ అధికరణ స్వాభావ స్వరూపాన్ని పరిశీలించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్‌లో గవర్నర్ సివి ఆనంద బోస్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, అక్కడి అధికారులు తనను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించిన మాజీ మహిళా ఉద్యోగి

పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం నిన్న ఈ మహిళ పిటిషన్ పై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. రాజ్యాంగంలో **32** వ అధికరణ కింద దాఖలు చేసిన పిటిషన్‌లో భారత ప్రభుత్వాన్ని ఇంప్లీడ్ చేయడానికి ఆమెకు స్వేచ్ఛను ఇచ్చింది. రాజ్యాంగ సమస్యను పరిష్కరించడంలో అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సహాయాన్ని కూడా కోరింది.

## ANDHRA PRADESH-NITI AAYOG

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ఇతర  నిపుణులతో నిన్న సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ - **2047** విజన్ డాక్యుమెంట్ తయారీపై నీతి ఆయోగ్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వినూత్న ఆలోచనలు, సాంకేతికతను ఉపయోగించుకుని పేదరికం లేని సమాజాన్ని సాధించాలన్నారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లోనూ పెనుమార్పులు తీసుకువస్తుందని, అమరావతి, విశాఖపట్నంలను ఏఐ హబ్‌లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కోరారు. నూతన సాంకేతికతను, అవకాశాలను అందిపుచ్చుకునే విధానాలు విజన్ డాక్యుమెంట్‌లో ఉండాలని చంద్రబాబునాయుడు అన్నారు. సంపద సృష్టికి దోహదపడే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఐఐటీ, ఐఐఎం, ఐఎస్‌బీ వంటి సంస్థలు, మేధావులు, నిపుణుల నుంచి ఇన్‌పుట్‌లను తీసుకుని ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని ఆయన అభిప్రాయపడ్డారు. **15** శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేయాలని, **15** శాతం వృద్ధిరేటు సాధించడం వల్ల ప్రజల తలసరి ఆదాయం రెట్టింపు అవుతుందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ముఖ్యమంత్రి అన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌పై మరిన్ని సమావేశాలు, చర్చలు నిర్వహించి రానున్న రోజుల్లో విడుదల చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

## IMD RAINS

ప్రస్తుతం బంగాళఖాతం వాయువ్య ప్రాంతంలో దాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని అల్పపీడనం ప్రభావంతో కోస్తాంధ్ర, యానాం, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో ఈరోజు, విదర్భ, తెలంగాణలపై ఈరోజు, రేపు అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ రోజు , రేపు కొంకణ్, గోవా, కోస్తా కర్ణాటక, దక్షిణ కర్నాటకలో చాలా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గుజరాత్‌లో ఈరోజు నుంచి మూడు రోజుల పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరాంధ్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ లను ఆనుకుని ఉన్న తీరాల వెంబడి ఈరోజు, రేపు చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు అధికారులు సూచించారు.

## KWATRA- US AMBASSADOR

మాజీ విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా అమెరికాలో భారత రాయబారిగా నియమితులయ్యారు. **1988** బ్యాచ్ **IFS** అధికారి అయిన క్వాత్రా ప్రస్తుత రాయబారి తరంజిత్ సింగ్ సంధు పదవీ విరమణ తర్వాత త్వరలో ఈ పదవిని చేపట్టనున్నారు.

## PM-MANN KI BAAT:

ఈనెల 28వ తేదీన ప్రసారం కానున్న మన్ కీ బాత్ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో సలహాలు, సూచనలు రావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఈ విషయం తెలియజేస్తూ నరేంద్రమోదీ తన ప్రసంగంలో ప్రస్తావించవలసిన అంశాల గురించి తనకు అసంఖ్యాకంగా సూచనలు లభిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా సమాజాన్ని పరివర్తనం చేసేందుకు చేస్తున్న సమిష్టి ప్రయత్నాల గురించి మాట్లాడవలసిందిగా అనేక మంది యువజనులు తనకు సూచించడం ఎంతో సంతోషకరమని ప్రధానమంత్రి అన్నారు. మై గౌవ్ నమో ఆప్ పైన తమ సూచనలు చేయాలని లేదా 1800117800 నెంబర్ పై సందేశాన్ని రికార్డు చేసి పంపాలని ప్రధానమంత్రి సూచించారు. ఆకాశవాణి ద్వారా ప్రతి నెల

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలతో తన మనసులోని ఆలోచనలను పంచుకొనే మన్ కి బాత్ ప్రసంగం ఈనెల 28వ తేదీన ప్రసారం అవుతుంది.

## KHARIF CROPS

గత ఏడాది **680** లక్షల హెక్టార్లలో ఖరీఫ్ పంటలు సాగవగా, ఈ ఏడాది ఇప్పటి వరకు **704** లక్షల హెక్టార్లలో సాగైందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. **166** లక్షల హెక్టార్లలో వరి సాగైంది, ఇది గత సంవత్సరం కంటే **11** లక్షల హెక్టార్లు ఎక్కువ. కాగా **85** లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పప్పుధాన్యాల సాగు జరిగింది, ఇది గత ఏడాదితో పోలిస్తే **15** లక్షల హెక్టార్లకు పైగా ఉందని పేర్కొంది.

## ASIA CUP WOMEN'S CRICKET

మహిళల ఆసియా కప్ **T20** క్రికెట్‌లో, శ్రీలంకలోని దంబుల్లా వేదికగా నిన్న సాయంత్రం జరిగిన మ్యాచ్ లో నిరుటి ఛాంపియన్ భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. **109** పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారతజట్టు మరో **35** బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది.